క్లుప్తంగా

నేడు పొన్నలూరులో ప్రత్యేక గ్రీవెన్స్

పొన్నలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజల సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పుల్లారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్‌లో మంత్రి స్వామి, ఉన్నతాధికారులు పాల్గొంటారని, మండల ప్రజలు వారి సమస్యలపై అర్జీలు సమర్పించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



పొన్నలూరులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చర్యలు తప్పవని ఎస్సై అనూక్ హెచ్చరించారు. పొన్నలూరులో ఓవీ రోడ్డుపై ఆదివారం వాహనాలు తనిఖీ చేపట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపట్టారు. అలాగే సరైన పత్రాలతో పాటు, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారికి జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలకు గురవుతారన్నారు. అలాగే మైనర్లు బైకులు నడుపుతూ పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న వయసులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. లైసెన్స్ లేకపోయినా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుస్తకాలే మన స్నేహాలు



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు: పుస్తకాలే మన స్నేహాలు అని.. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు గుమ్మడి వర్ధనరాజు తెలిపారు. ఆదివారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో పాఠకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను తప్పించబోయి యువకులకు గాయాలు

హనుమంతునిపాడు: ట్రాక్టర్‌ను తప్పించబోయి బైక్ అదుపు తప్పడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన మండల పరిధిలో కంభం-కనిగిరి రహదారి హాజీపురం ఎత్తు రోడ్డు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. ఉమ్మనపల్లి గ్రామానికి చెందిన జనుమాల మహిధర్, ఈదా జోసఫ్ ఇద్దరు కలిసి గ్రామం నుంచి బైక్‌పై కనిగిరికి వస్తున్నారు. ఈక్రమంలో హాజీపురం ఎత్తు రోడ్డు వద్దకు వచ్చేసరికి కనిగిరి వైపు నుంచి పొగాకు లోడుతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయారు. వెంటనే బైక్ అదుపుతప్పి కిందపడటంతో మహీధర్, జోసఫ్‌లకు గాయాలయ్యాయి.

రెండు బైకుల ఢీ, ఇద్దరికి గాయాలు

హనుమంతునిపాడు: ఎదురెదుగా రెండు బైక్‌లు ఢీకొట్టుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని పాపిరెడ్డిపల్లి-వాలిచర్ల రోడ్డులో ఆదివారం జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు.. వాలిచర్ల గ్రామానికి చెందిన గంగిరెడ్డి మదన్‌మోహన్ రెడ్డి, అఖిల్ ఇద్దరూ వాలిచర్ల నుంచి మోటార్ బైక్‌పై పాపిరెడ్డిపల్లి వైపు వస్తున్నారు. ఈక్రమంలో పాపిరెడ్డిపల్లి వైపు నుంచి మరో బైక్ ఎదురుగా వచ్చి ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో మదన్‌మోహన్‌రెడ్డి, బాలుడు అఖిల్ కిందపడటంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



నియోజకవర్గంలో రైతుసేవా కేంద్రాలు మొత్తం 96	
కనిగిరి మండలంలో	23
పామూరు	19
సీఎస్‌పురం	15
పీసీపల్లి	13
వెలిగండ్ల	12
హనుమంతునిపాడు	14

యంత్రాల్లేవ్.. అన్ని మంత్రాలే !

- కూటమి పాలనలో సీహెచ్‌సీలకు మంగళం
- రైతులందరికి దక్కని యంత్ర పరికరాలు
- గత ప్రభుత్వంలో ఒక్కో సీహెచ్‌సీకి సుమారు రూ.20 లక్షల వరకు లబ్ధి
- కూటమి పాలనలో పరికరాల పంపిణీలో వివక్షత ?



వైఎస్సార్ సీపీ హయాంలో అందజేసిన యంత్ర పరికరాలు (ఫైల్)

కనిగిరిరూరల్:

వైఎస్సార్ సీపీ పాలనలో రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, విధానాలు రైతులకు ఎంతో మేలు చేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని ఒక్కొక్కటిగా నిరీర్యం చేస్తోంది. ప్రజలకు, రైతులకు అందాల్సిన సేవలు అందని ద్రాక్షలా మారుతున్నాయి. రైతులకు ఎంతో ఉన్నత సేవలు అందించిన రైతుసేవా కేంద్రాల పరిస్థితి ప్రస్తుతం మరింత దయనీయంగా మారింది. అంతేగాక గతంలో ప్రభుత్వం అందించిన రైతుల యంత్ర పరికరాల పంపిణీ పథకాలు సైతం.. అధికార పార్టీవారికి, వారి సానుభూతి పరులకు, కొందరికే దరి చేరుతుండటంతో రైతు వర్గాలు భగ్గుమంటున్నాయి.

సీహెచ్‌సీలకు చరమగీతం..

రైతుసేవా కేంద్రాల్లో కియోస్క్‌లకు కూటమి సర్కార్ మంగళం పాడింది. క్షేత్ర స్థాయిలో రైతులకు ఎంతో మేలు చేసే కస్టమ్ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ)లకు సైతం చరమగీతం పాడింది. రైతులకు వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, పరికరాలు, ఇచ్చేందుకు గత ప్రభుత్వంలో డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద అనేక పరికరాలను రైతులకు అందజేసింది. ట్రాక్టర్లు, ట్రక్కులు, ఇంజన్లు, పనిముట్లు, యంత్ర సామాన్లు, పంపిణీ చేశారు. అందుకు గ్రామాల్లో పార్టీలు, కులాలు, వర్గాల కతీతంగా అర్హత కల్గిన రైతులందరిని సంఘాలుగా ఏర్పాటు చేసి (సీహెచ్‌సీలు)కస్టమ్ హైరింగ్ సెంటర్‌గా పేరు పెట్టారు. ప్రతి సంఘానికి 40 శాతం సబ్సిడీ పై సుమారు రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు పరికరాల లబ్ధిని చేకూర్చారు.

కనిగిరి డివిజన్‌లో రూ 15 కోట్ల లబ్ధి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీహెచ్‌సీల ద్వారా నియోజకవర్గంలోని 96 ఆర్‌బీకే కేంద్రాల పరిధిలో గల గ్రూపులకు 2021-22, 2022- 23 ఏడాదికి సుమారు రూ.15 లక్షల మేర వ్యవసాయ పరికరాలు యంత్రాలు 40 శాతం రాయితీ, 60 శాతం బ్యాంకు రుణంతో ట్రాక్టర్లు, రోటో మేటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, దుక్కు సెట్లు, తదితర వాటిని అందజేశారు. వీటిని సంఘంలోని రైతులతో పాటు, గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతు సంఘాలకు కాకుండా నేరుగా రైతులకు అందజేస్తున్నట్లు ప్రకటనలు గుప్పించి.. అన్ని వర్గాల, అర్హత కలిగిన రైతులందరి కాకుండా సన్న, చిన్న కారు రైతుల పేరిట అధికార పార్టీ నేతలకు, వారి సానుభూతిపరులకు యంత్ర పరికరాలు సబ్సిడీపై ఇచ్చారు. కనిగిరి నియోజకవర్గంలో సుమారు 190 మంది రైతులకు 190 వస్తువులు రూ.2 కోట్లు విలువ చేసే వాటిని పంపిణీ చేసినట్లు తెలిసింది. రైతువర్గాలు, రైతు నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు.

గత ప్రభుత్వం విధానంతోనే రైతులకు మేలు..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ యంత్ర పరికరాలు అందాయి. సీహెచ్‌సీల ద్వారా రైతు సంఘాలు ఏర్పాటు చేసి పార్టీలకతీతంగా వ్యవసాయ పనిముట్లు అందజేశారు. గ్రామంలోని మిగతా రైతులకు కూడా వాటిని వాడుకునే వారు. కూటమి సర్కార్‌లో కొంత మందికే యంత్ర పరికరాలు ఇవ్వడం వల్ల వారికి తప్ప మిగతా రైతులకు ప్రయోజనం కలగలేదు.

పోలక సిద్దారెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

సీహెచ్‌సీలతో రైతులందరికీ న్యాయం..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీహెచ్‌సీల పేరుతో ఏర్పాటు చేసిన సంఘాలో రైతులందరికీ న్యాయం జరిగింది. మా పంచాయతీలోని ఆర్‌బీకే పరిధిలో సుమారు రూ. 20 లక్షలకు పైగా విలువ చేసే వ్యయసాయ యంత్ర పరికరాలు, పనిముట్లు ఏడుగురికి కలిపి ఇచ్చారు. దాన్ని అందరూ సద్వినియోగం చేసుకున్నాం. దీని వల్ల రైతుకు పెట్టుబడి ఖర్చు కొంత తగ్గేది. కొంత మందికే పరికరాలు ఇవ్వడం సరికాదు. గతంలో మాదిరిగా సంఘాలు ఏర్పాటు చేసి గ్రామంలోని అర్హులైన రైతులకు ఇవ్వాలి.

– ఎం బ్రహ్మారెడ్డి, రైతు, పోలవరం

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన



మహానివేదనతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, చైర్మన్, ఈవో, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అభిషేకం, గోపూజ, మహానివేదన కార్యక్రమం అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణస్వామి వారి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ మహానైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, వెంకట్రావు,భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల నిర్మాణం అందరి బాధ్యత



చెత్త బుట్టలు పంపిణీచేస్తున ఎంపీపీ, హుసేన్‌రెడ్డి, కందుల శ్రీను

పామూరు: స్వచ్ఛ గ్రామాల నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని దూబగుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పడమటిపల్లెలో ఆదివారం ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు కందుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు ఇంట్లోని వ్యర్థాలను కాల్వలు, రోడ్లపైన, సమీపంలోని ఖాళీ ప్రదేశాల్లో వేయకూడదన్నారు. గ్రామ పంచాయతీ ఇచ్చిన చెత్తబుట్టల్లో తడి, పొడి వ్యర్థాలను విడివిడిగా వేయాలని సూచించారు. బుట్టల్లో వేసిన వ్యర్థాలను పంచాయతీ వాహనాల్లో కాని, నిర్దేశిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లలో కాని వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి, గ్రీవెన్సెసెల్ రాష్ట్ర కార్యదర్శి గట్లా విజయబాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కందుల శివరామిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, యేసమ్మ, వర్షమ్మ, విశ్రాంతమ్మ, దారమయ్య, గురవయ్య, రాజా, సాల్మాన్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సేవాహిత కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ఎన్జీవో భవన్ ఆవరణలో ఆదివారం పేద ముస్లిం పిల్లలకు ఉచిత సున్తీ కార్యక్రమం కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ తమ సొసైటీ ద్వార గత 18 ఏళ్లుగా అనేక సేవాహిత కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో 103 మందికి సున్తీ (వైద్య చికిత్సలు) నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది సుమైర్, హన్ను, బన్ను, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సానికొమ్ము రంగనాయకులరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యులు సయ్యద్‌యాసీన్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చాంద్ బాషా, తూము వెంకట కృష్ణారెడ్డి, జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే షరీఫ్, విశ్రాంత ఎంఈఓ మస్తాన్‌వలి, అంజుమన్ కమిటీ ట్రెజరర్ ఎస్‌కే మొహమ్మద్ ముస్తాఫా, ముఫ్తి అబ్దుల్ కలాం, అంజుమన్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎస్‌కే లతీఫ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం



దద్దాల నారాయణను సన్మానిస్తున్న సుజాత

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పట్టణానికి చెందిన 7వ వార్డు కౌన్సిలర్ తమ్మినేని సుజాత నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం తమ్మినేని సుజాత పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం తమ్మినేని సుజాతారెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవుల భాస్కర్‌రెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, సైకం స్వర్ణ ఏడుకొండలురెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, తమ్మినేని ఉమాశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

40 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణమోహన్

కొండపి: మండలంలోని కట్టవారిపాలెం గ్రామంలో స్థానిక స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించి 40 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ బీపీ, షుగరు వ్యాధులు మామూలు వ్యాధుల వలే జబ్బులు కాదని.. శరీరంలో కొన్ని గ్రంథులు సరిగా పనిచేయక పోవడం, ఇతర సాంకేతిక కారణా వలన ఏర్పడే జీవక్రియ లోపాలని అన్నారు. 40 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరూ అప్పుడప్పుడు షుగరు, బీపీ పరీక్షలు చేయించుకుని రోగ నిర్ధారణ చేయించు కోవడం ముఖ్యమని అన్నారు. అశ్రద్ధ చేస్తే ముప్పు తప్పదని, అందరూ ధ్యానం, యోగా వంటివి సాధన చేస్తూ ప్రశాంత జీవితం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, మానికొండ వెంకటేశ్వర్లు, రావెళ్ల చెంచయ్య, ఆరోగ్య భవనం దాత గుంటుపల్లి కోటయ్య గ్రామ ప్రజలు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నిసార్లు చెప్పాలి సార్.. !



వృథాగా పోతున్న సాగర్ జలాలు



రోడ్డు మీదికి వచ్చిన సాగర్ నీరు

- పైప్‌లైను పగిలి వృథాగా సాగర్ జలాలు

హనుమంతునిపాడు: అధికారులు, కూటమి నాయకుల అలసత్వం కారణంగా గ్రామాలు గొంతెండుతున్నాయి. అరకొరగా వస్తున్న సాగర్ నీటిని జాగ్రత్తగా సరఫరా చేయాల్సి ఉండగా పైప్ లైన్‌లు పగిలి వృథాగా పోతున్నాయి. వాటికి మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రం హనుమంతునిపాడులో హాజీపురం ఓవర్ హెడ్ ట్యాంక్‌కు, సంప్‌లకు సరఫరా అయ్యే ప్రధాన పైపులైను పగిలి నీరంతా వృథాగా పోతోంది. ఆదివారం విద్యుత్ స్తంభాలు వేసే జేసీబీ గుంతలు తీస్తుండటంతో పైపులైన్ పగిలిపోయింది. దీంతో సాగర్ నీరంతా రోడ్డు పాలైంది. ఇంతకు ముందు కూడా ఇలాగే పైపులైన్లు పగలడంతో 15 రోజులపాటు నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు స్పందించి వెంటనే పైపుల మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈదురుగాలుల బీభత్సం



దుమ్ముతో నిండిన రైల్వేస్టేషన్ రోడ్డు

సింగరాయకొండ: ఎండతీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా చల్లబడటంతో నియోజకవర్గ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎండ తీవ్రతకు ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే బయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 10 నిమిషాల సేపు ఈదురుగాలులు వీయడంతో రోడ్లన్ని దుమ్ముతో నిండిపోయాయి. దీంతో ప్రజలు ఒక్కసారిగా రేగిన దుమ్ముతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. తరువాత రెండు నిమిషాల పాటు తేలికపాటి జల్లులు పడ్డాయి. ఈదురుగాలుల కారణంగా సుమారు అరగంట సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గిరులలో.. భానుడి భగభగలు

- కనిగిరి ప్రాంతంలో తీవ్రంగా ఎండలు
- అల్లాడుతున్న ప్రజలు
- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- బయటకు రావడానికి జంకుతున్న జనాలు



కనిగిరిలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు , జనసంచారం లేని ప్రధాన సెంటర్



కనిగిరిరూరల్: కొండ ప్రాంతమైన కనిగిరి ఏరియాల్లో భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఉదయం 8 గంటల నుంచే సూరీడు సెగలు కక్కుతున్నాడు. గత వారం రోజుల నుంచి ఉష్ణోగ్రత వివరాలు పరిశీలిస్తే 38, 39, డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉంది. దీంతో 11 గంటలకు అయ్యేసరికి ప్రజలు బయటకు రాలేని దుస్థితి. తప్పని సరిపరిస్థితుల్లో ఎండలో బయటకు వచ్చే వారు టోపి ధరించాలని, లేదా గొడుగుతో బయటకు రావాలని, చేతిలో లేదా బైక్‌లో తప్పనిసరిగా వాటర్ బాటిల్ ఉంచుకోవాలని వైద్యులు చెప్తున్నారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులు సాధ్యమైనంత వరకు ఎండలో తిరగకుండా ఉంటేనే మంచిదని, ఇక ఎండ వేడిమి.. వడగాలులకు వడ దెబ్బ తగల కుండా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు తెలిపారు.

మధ్యాహ్న ప్రయాణాలు తగ్గించుకోవాలి..

వేసవిలో వీలైనంత వరకు ప్రయాణాలు తగ్గించుకోవడం మేలు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి వడ దెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువ. వీలైనంత వరకు 10 గంటల్లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత ప్రయాణం చేస్తే మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నీటిని ఎక్కువగా తాగాలి.
- నీటి శాతం అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలి.
- పండ్ల రసాల కన్నా పండ్లు తింటేనే ఎక్కువగా లాభం.
- తేలిక పాటి, నూలు లేత రంగు, వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.
- సాధ్యమైనంత వరకు ప్రయాణాలు మానుకోవడం ఉత్తమం. అత్యవసర పరిస్థితిల్లో వెళ్లాల్సి వస్తే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

చుట్టూ అల్లుకున్న ప్రమాదం

టంగుటూరు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న పోతుల చెంచయ్య కాలనీ గ్రామ సచివాలయం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పొదళ్లతో ప్రమాదకరంగా మారింది. ఈకాలనీలో నిత్యం ప్రజలు తిరుగుతూనే ఉంటారు. స్తంభం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎగబాకాయి. వేసవిలో ఈదులుగాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున్న విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కావునా ఇప్పటికైనా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పొదలను తొలగించాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పొదలతో నిండి ఉన్న విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్